ప్రజాశక్తి
ఆదివారం 18 మే 2025 5
శ్రీ సత్యసాయి





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

జిల్లాలో ఐదు పారిశ్రామిక హబ్‌లు

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో వివిధ పరిశ్రమల స్థాపనకు పార్కుల ఏర్పాటు కోసం 35 వేల ఎకరాల భూ సేకరణ కార్యక్రమం వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో పరిశ్రమల స్థాపనకు భూసేకరణ సంబంధించిన అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జెడ్‌ఎం ఏపీఐఐసీ, సుహానా సోనీ, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, పెనుగొండ ఆర్డీవో ఆనంద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవతో జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఆమోదముద్ర వేసిందని తెలిపారు. ఈ పరిశ్రమల వల్ల యువతకు ఉపాధి దొరుకుతుందని తెలిపారు. అందుకు అవసరమైన భూసేకరణ కార్యక్రమం త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులు ఆదేశించారు. ల్యాండ్ బ్యాంక్‌ను గుర్తించి జిల్లాలో వివిధ పారిశ్రామిక పార్కులను స్థాపించడానికి 5 బ్లాక్‌లను గుర్తించాలని తెలిపారు. మండలాల్లో ప్రభుత్వ భూములను వెంటనే ఏపీఐఐసీకి అప్పగించాలి తెలిపారు. జిల్లాలో ఐదు పారిశ్రామిక నగరాలుగా అభివద్ధి చెందుతాయన్నారు. హిందూపురం- లేపాక్షిహబ్ గా, చిలమత్తూరు - గోరంట్ల పారిశ్రామిక హబ్ గా, మడకశిర హబ్‌గా, పెనుగొండ-కియా హబ్‌గా, పుట్టపర్తి హబ్‌గా అభివద్ధి చెందుతాయని చెప్పారు. రామగిరి, కనగానిపల్లి మండలాలు సోలార్ పార్కుల కోసం భూమిని గుర్తించి నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల తహాశీల్దార్లు పాల్గొన్నారు.



- జెఎన్‌టియులో పండుగ వాతావరణం
- విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి
- ఛాన్సలర్ హోదాలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్
- 41 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేత
- డా॥సత్యనారాయణ చావకు గౌరవ డాక్టరేట్ ప్రదానం

సంబరంగా స్నాతకోత్సవం..!



ఆరు బంగారు పతకాలు అందుకున్న విద్యార్థి పూజిత్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం నగరంలోని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జెఎన్‌టియు) 14వ స్నాతకోత్సవం కార్యక్రమం శనివారం నాడు సంబరంగా జరిగింది. ఛాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జెఎన్‌టియుకు చేరుకున్న గవర్నర్‌కు వైస్‌ఛాన్సలర్ హెచ్.సుదర్శనావు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్లు, యూనివర్సిటీ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఎన్టీఆర్ ఆడిటోరియంలో 14వ స్నాతకోత్సవం కార్యక్రమాన్ని ఉదయం 11 గంటలకు ప్రారంభించారు. హైదరాబాద్ లారెన్స్ ల్యాబ్స్ లిమిటెడ్ ఫౌండర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డా॥సత్యనారాయణ చావకు గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ ప్రదానం చేశారు. 41 మంది విద్యార్థులకు బంగారు పథకాలను గవర్నర్ అందజేశారు. అందులో పూజిత్ కుమార్ రెడ్డి అత్యధికంగా ఆరు బంగారు పథకాలు, విద్యార్థిని సుప్రజా నాలుగు బంగారు పతకాలు అందుకున్నారు. స్నాతకోత్సవానికి ఐఐటి కాన్పూర్ సివిల్ ఇంజినీరింగ్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఎంఆర్.మాధవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ కార్యదర్శి ఎం.జవహర్ లాల్, కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్, వైస్ ఛాన్సలర్ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, అకడమిక్ ప్లానింగ్ డైరెక్టరు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ ఆచార్య దుర్గా ప్రసాద్, పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య నాగప్రసాద్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, సింధూరరెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు.. తల్లిదండ్రుల సందడి

అనంతపురం జెఎన్‌టియు స్నాతకోత్సవం సందర్భంగా యూనివర్సిటీ ప్రాంగణంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, బంధువులతో సందడి నెలకొంది. ఇంజనీరింగ్, ఫార్మసీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేసే కార్యక్రమం ఆద్యంతం క్రమశిక్షణతో నడిచింది. విద్యను పూర్తి చేసుకుని పట్టాను పొందే క్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు అక్కడికి విచ్చేసి తమ పిల్లలు ప్రయోజకులయ్యారని కళ్లారా తిలకించి ఆనందపడ్డారు. తమ సంతోష మధుర క్షణాల్లో సెల్ఫీలు తీసుకుంటూ ఆనంద పడ్డారు.

41 మందికి బంగారు పతకాలు...

40,109 మంది డిగ్రీ పట్టాలు

ఇంజినీరింగ్, ఫార్మసీ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన 41 మంది విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. 40,109 మంది విద్యార్థులకు యూజి, పిజి డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. పరిశోధనలకు సంబంధించి ఇంజినీరింగ్‌లో 167 మందికి, డాక్టర్ ఆఫ్ ఫార్మసీలో 361 మందికి, ఎంటెక్, ఎంఫార్మసి, ఎంఎబి పూర్తి చేసిన వారికి 9564 మందికి డిగ్రీలు ప్రదానం చేశారు. బిటెక్, బిఫార్మసి పూర్తి చేసిన విద్యార్థులు 30,017 మందికి డిగ్రీలు ప్రదానం చేశారు.



డాక్టరేట్ అందుకుంటున్న డాక్టర్ సత్యనారాయణ చావా

'అనంత'జెఎన్‌టియు అగ్రగామి

గవర్నర్ అబ్దుల్ నజీర్



నూతన విద్యా విధానం అమలు చేయడంలో అనంతపురం జెఎన్‌టియు ముందు భాగంలో ఉందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. ఛానల్సర్ హోదాలో స్నాతకోత్సవానికి హాజరైన ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. జెఎన్‌టియుఎ క్వాంటమ్ ఇంజినీరింగ్‌ను మిని డిగ్రీగా అమలు చేస్తోందన్నారు. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కోర్సులను తీసుకొస్తూ ముందుకెళుతోందన్నారు. విద్యను పూర్తి చేసి బయట పోటీ ప్రపంచంలోకి అడుగుపెడుతున్న విద్యార్థులు అందుకు అనుగుణంగా సన్నద్ధమవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మనం నాలుగో పారిశ్రామిక విప్లవంలో ఉన్నామన్నారు. మిషన్ లర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలెజెన్స్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని ముందుకెళ్లేందుకు విద్యార్థులు సన్నద్ధమవ్వాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. అభివృద్ధి ఫలాలను కార్పొరేట్ గోడలను దాటించి గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరువ చేసే విధంగా కృషి చేయాలని సూచించారు. అటు భారత దేశంలోనూ, ఇటు రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధికి వివిధ రకాల చర్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్నాయన్నారు.

మార్పులను అందిపుచ్చుకోవాలి


ఆర్‌ఎం.మాధవ్ ఐఐటి రిటైర్డు ప్రొఫెసర్



ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఆర్‌ఎం.మాధవ్ మాట్లాడుతూ సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు వస్తున్నాయన్నారు. తాము చదువుకుని బయటకొచ్చిన సమయంలో నిర్మాణ రంగంలో చూసినప్పుడు భవన నిర్మాణానికి 80 శాతం ఖర్చు అయితే, ఇంటీరియర్‌కు 20 శాతమే ఖర్చు అయ్యేదన్నారు. ఇప్పుడు అందుకు విరుద్ధంగా నిర్మాణం కంటే ఇంటీరియర్ ఖర్చు అధికమవుతోందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సులోనూ వేగంగా మార్పులొస్తున్నాయన్నారు. ఒక్కప్పుడు చాట్ జిపిటినే అనేవాళ్లు ఇప్పుడు డీప్ సీక్ అనేది వచ్చింది. ఇలా సాంకేతికంగా వేగంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని ముందుకెళ్లాల్సిన అవసరముంటుందని చెప్పారు.

కదిరి వైసిపికి షాక్

13 మంది వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరిక



కందికుంట సమక్షంలో టిడిపిలో చేరిన వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి-కదిరి టౌన్

శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజవకర్గం వైసిపికి భారీ షాక్ తగిలింది. .వైసీపీకి చెందిన 13 మంది కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. శనివారం నాడు ఎమ్మెల్యే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో వారు టిడిపి కండువాలు కప్పుకున్నారు. మరో రెండు రోజుల్లో కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్నిక ఉన్న నేపథ్యంలో వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరడంతో ఛైర్మన్ గిరి టిడిపి వశం కావడం లాంఛనమే అయ్యింది. కదిరి మున్సిపాల్టీలో మొత్తం 36 ఉండగా ప్రస్తుతం వైసిపిలో చేరిన వారితో కలిపి టిడిపికి 25 మంది కౌన్సిలర్లు అయ్యారు. వైసీపీకి 11 మంది కౌన్సిలర్లు మిగిలారు. సోమవారం నాడు ఛైర్మన్ ఎన్నిక నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నోటిఫికేషన్ జారిచేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం టిడిపికి ఉన్న సంఖ్యా బలంతో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ స్థానాలను సులువుగా ఆ పార్టీ ఖాతాలో వేసుకోనుంది.

వైసిపిది అవినీతి పాలన : కందికుంట

గత వైసిపి పాలనలో మితిమీరిన అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. వార్డుల్లో అభివృద్ధి జరగక కౌన్సిలర్లు విసిగిపోయారన్నారు. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని గ్రహించి వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరారన్నారు.

భూ తగాదాలో దంపతుల దారుణహత్య

భూ తగాదాలో భార్య భర్తలు దారుణహత్యకు గురైన సంఘటన అనంతపురం జిల్లా రాప్తాడు మండలం గంగలకుంట గ్రామంలో శనివారం ఉదయం చోటు చేసుకుంది. గొల్లపల్లికి గ్రామానికి చెందిన నారాయణరెడ్డి(50), ముత్యాలమ్మ(45) భార్యాభర్తలు ఈ ఘటనలో మరణించారు.

వార్త మెయిన్‌లో..

రైల్వే ప్రయాణికుల భద్రతే ముఖ్యం

ఆర్‌పిఎఫ్ సౌత్ రైల్వే ఐజి ఆరోమాసింగ్ ఠాకూర్

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

రైల్వే ప్రయాణికుల భద్రతే తమ లక్ష్యమని ఆర్‌పిఎఫ్ సౌత్ సెంట్రల్ రైల్వే ఐజి ఆరోమాసింగ్ ఠాకూర్ తెలిపారు. ఆమె శనివారం పట్టణంలోని ఆర్‌పిఎఫ్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. నమోదైన కేసులు, వాటి పరిష్కార వివరాలను సిఐ నాగేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఆర్‌పిఎఫ్ విభాగంలో మహిళలకు పటిష్ట భద్రత కల్పించడమే రైల్వే శాఖ లక్ష్యమన్నారు. అలాగే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సుఖవంతంగా ప్రయాణం చేయడానికి ఆర్‌పిఎఫ్ అన్ని చర్యలు చేపట్టిందన్నారు. తదుపరి రైల్వేస్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతపై అధికా రులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఆమె వెంట గుంతకల్లు డివిజన్ కమిషనర్ మురళీకృష్ణ, గుంతకల్లు అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ అనిల్‌కుమార్‌సింగ్, రేణిగుంట అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాల్‌రెడ్డి, ఆర్‌పిఎఫ్ ఎస్ఐ రోహిత్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.



నేలకొరిగిన అరటి చెట్లు

గుడ్డంపల్లిలో ఈదురు గాలులు

నేలకొరిగిన అరటి చెట్లు

ప్రజాశక్తి-తాడిమర్రి

మండల పరిధిలోని గుడ్డంపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి బలమైన ఈదురుగాలులు వీచాయి. గాలులకు పలు అరటి చెట్లు నేలవాలాయి. గుడ్డంపల్లికి చెందిన రైతు కె.ఓబుళపతి చెందిన 4 ఎకరాల్లో అరటి చెట్లు నేలకొరిగాయి. చేతికొచ్చిన పంట ఇలా నేలవాలడంతో రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

పారా లీగల్ వాలంటీర్లు నిబద్ధతతో పనిచేయాలి

ఏడీజే కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు నియమించిన పారా లీగల్ వాలంటీర్లు నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. శనివారం అదనపు జిల్లా న్యాయస్థానం ఆవరణలో జిల్లా జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ పారా లీగల్ వాలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిజె మాట్లాడుతూ పారా లీగల్ వాలంటీర్లు స్వచ్ఛందంగా ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. వాలంటీర్లు తమకు కేటాయించిన విధులను నిర్వహిస్తూ ప్రజల సామాజిక, వ్యక్తిగత సమస్యలను పరిష్కరించడంపై దష్టి సారించాలన్నారు. వాలంటీర్ల పరిధిలో సమస్య పరిష్కారం కానిపక్షంలో లిఖితపూర్వకంగా మండల న్యాయ సేవా అధికారి సంస్థ దష్టికి బాధితుల ద్వారా తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. రాజీ చేసుకునే సమస్యలు ఉంటే వెంటనే అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. భార్యాభర్తల నడుమ చోటుచేసుకునే ఘర్షణలు, మనస్పర్ధలను సాధ్యమైనంతవరకు ఇద్దరికీ కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరించేలా వాలంటీర్లు చర్యలు తీసుకోవాలన్నారు. భూతగాదా కేసులు ఉంటే న్యాయస్థానం దష్టికి తీసుకువచ్చేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, శారద, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయమూర్తి కంపల్లె శైలజ

'ఆడుదాం ఆంధ్ర' అవినీతిపై..

విజిలెన్స్ విచారణ

ప్రజాశక్తి-చిలమత్తూరు

గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ(శాప్)లో జరిగిన అవక తవకలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు శనివారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర పోటీల్లో మండల స్థాయిలో చేసిన చెల్లింపులకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు భోజన సదుపాయాలు, తదితర అంశాల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. విచారణ అధికారుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ గోపాలుడు, ఏవో వాసుప్రకాష్, చలం ఉన్నారు.



ఆడుదాం ఆంధ్రపై విచారణ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

సైనికులకు బాసటగా నిలుద్దాం

కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్న



తిరంగా ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

దేశ రక్షణ కోసం ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాటం చేస్తున్న సైనికులకు ప్రతి ఒక్కరూ బాసటగా నిలవాలని కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్న, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డిలు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా పుట్టపర్తి పట్టణంలో తిరంగా ర్యాలీని శనివారం రాత్రి చేపట్టారు. సత్తమ్మ గుడి నుంచి సాయి మా హోటల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ సైనికులు ప్రజల రక్షణ కోసం దేశ సరిహద్దుల్లో ప్రాణాలను ఎదురొడ్డి పోరాడుతున్నారని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ సైనికులకు వారి కుటుంబాలకు ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ పెహల్గాం ఉగ్రదాడికి భారత సైనికులు ధీటుగా జవాబు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఉమ్మడి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బి.గంగాధర్ కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఖాద్రీశుడి సన్నిధిలో భక్తులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో శనివారం విచ్చేశారు. కర్నాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతముల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు అతి శీఘ్రదర్శనం, ప్రత్యేక దర్శనం, ఉచిత దర్శనం ఏర్పాట్లను చేశారు. భక్తులకు నిత్య అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆర్డీటీ సేవలకు ఆటంకాలు సృష్టించొద్దు

కెవిపిఎస్, బీఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం

పేద వర్గాలకు అండగా నిలుస్తున్న ఆర్‌డిటి సేవలను యథావిధిగా కొనసాగించేందుకు కేంద్రం ప్రభుత్వం అన్ని విధాలా అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కుల వివక్ష పోరాట సమితి, బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట కెవిపిఎస్, బిఎస్‌పి నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి, రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జి శ్రీరాములు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో పేదలకు సేవలు అందిస్తున్న ఆర్డీటీ సంస్థకు కేంద్రం ప్రభుత్వం ఆటంకాలు సృష్టించడం సరికాదన్నారు. కరోనా విపత్కర సమయంలోనూ ఆర్డీటీ ప్రజలకు సేవలు అందించిందన్నారు. ప్రభుత్వానికి సమాంతరంగా ఆర్డీటీ సేవలు ప్రజలకు అందుతున్నాయని తెలియజేశారు. అలాంటి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఎ పునరుద్ధరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం కషి చేయాలన్నారు. అనంతరం రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ అమరేంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు మౌలాలి, సుబ్బరాయప్ప, ఫక్రుద్దీన్, నరసింహప్ప, నారాయణస్వామి, వెంకటేష్, మారుతి, అంజినప్ప పాల్గొన్నారు.



రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌కు వినతిని ఇస్తున్న కెవిపిఎస్, బిఎస్‌పి నాయకులు

మున్సిపల్ నూతన కమిషనర్‌గా క్రాంతి కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం నూతన కమిషనర్‌గా క్రాంతికుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయన కమిషనర్ ప్రహ్లాద నుంచి బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ కోఆర్డినేటివ్ డిపార్ట్మెంట్‌లో ఏడాదిగా పనిచేస్తున్న క్రాంతి కుమార్ బదిలీపై ఇక్కడికి కమిషనర్‌గా వచ్చారు. నూతన కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, పాలకవర్గం, జిల్లా అధికారుల సహకారంతో మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు నడిపించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు. ఇక్కడ పనిచేసిన ప్రహ్లాదకు ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదని సమాచారం.

నూతన జాతీయ విద్యావిధానంతో నష్టం : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-హిందూపురం

నూతన జాతీయ విద్యా విధానం ప్రభుత్వ విద్యారంగాన్ని తీవ్ర నష్టం చేస్తుందని, తక్షణం దీనిని రద్దు చేయాలని భారత విద్యార్థి సమాఖ్య(ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా అధ్యక్షులు ఈరేష్ డిమాండ్ చేశారు. జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయడాన్ని నిరసిస్తూ శనివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈరేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న 9 రకాల బడుల విధానంతో గ్రామాల్లో పేద విద్యార్థులు విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉందన్నారు. జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసి, ప్రభుత్వ బడులను ఆధునీకరణ చేసి ప్రభుత్వ బడుల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఉచిత ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ హిందూపురం కన్వీనర్ అఫ్రిది, కో కన్వీనర్ అజ్మల్, ఇస్మాయిల్, ఉమేష్, నాయకులు కళ్యాణ్ పాల్గొన్నారు.

పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ అందరి బాధ్యత : కలెక్టర్

ప్రజాశక్తి-కొత్తచెరువు

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సిఎం చంద్రబాబు సిద్ధంగా ఉన్నారని, ఇప్పటికే 30 వేల ఎకరాలు సేకరించామని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కొత్తచెరువులో శనివారం చేపట్టిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, జనసేన, టిడిపి నాయకులు, ప్రజలు ప్ల కార్డులు చేతబూని ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం నిర్మించి ప్రజల చేత 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలెక్టర్ పుట్టపర్తి రోడ్డులోని బస్సు షెల్టర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఇళ్లు, వీధులు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా తాగునీరు అధికంగా తీసుకుంటూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రజల సహకారంతో రోడ్ల పైన ఉన్న విగ్రహాలను తొలగించి ఒకచోట ఏర్పాటు చేయాలని కోరారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా ఫుట్‌పాత్ వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కలెక్టర్ వెంట డిపిఒ సమత, డిఆర్‌డిఎ పిడి నరసయ్య, తహశీల్దార్ నీలకంఠారెడ్డి, ఎంపిడిఒ నటరాజు, మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, పిఆర్‌జెఈ నాగరాజు, డాక్టర్ అశ్విత్‌నారాయణ, పంచాయతీ సిబ్బంది, నాయకులు మాణిక్యంబాబా, జనసేన మండల కన్వీనర్ పూల శివప్రసాద్, వలిపి శ్రీనివాసులు, మానవ హక్కుల సంఘం నాయకులు పాపన్న పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

రాష్ట్రంలో రోడ్లకు మహర్దశ : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో రోడ్లకు మహర్దశ పట్టిందని మంత్రి సవిత తెలిపారు. మండలంలోని మునిమడుగు, గుట్టూరు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులను శనివారం మంత్రి పరిశీలించారు. రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశం చారు. మంత్రి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు గుంతల మయమై ప్రయాణం నరకప్రాయంగా ఉండేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే రాష్ట్రంలో వేల కోట్ల నిధులతో గుంతలు పూడ్చడం, మరమ్మతు చేపట్టడంతో పాటు నూతన రోడ్ల నిర్మాణం చేపట్టామ న్నారు. మంత్రి వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌కు మంత్రి పరామర్శ

రెండు నెలల క్రితం ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మండలంలోని మునిమడుగు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ తిరుమలనాయుడును శనివారం మంత్రి సవిత పరామర్శించారు. అతడి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరాతీ శారు. అధైర్య పడకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైద్య ఖర్చులకు ఆర్థికసాయం అందజేశారు. మంత్రి వెంట యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, నాయకులు మునిమడుగు వెంకటరాముడు, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణరెడ్డి, పోతిరెడ్డి, బోయ రామకృష్ణ, సోమశేఖర్, శేషు, బోయ రాము ఉన్నారు.



గుట్టూరులో నిర్మాణంలో ఉన్న రోడ్లను పరిశీలిస్తున్న మంత్రి సవిత

'వేతనాలు చెల్లించే వరకు పనిలోకి వెళ్లం'

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండల వ్యాప్తంగా పారిశుధ్య కార్మికు లకు వేతనాలు చెల్లించే వరకూ పనులు చేయమని, శనివారం నుంచి పనులు నిలిపివేస్తున్నామని పారిశుధ్య కార్మికుల యూనియన్ అధ్యక్షుడు ఎం.అక్కు లప్ప తెలిపారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు 16 నెలల నుంచి వేతనాలు అందడంలేదని, ఈ విషయమై పలుమార్లు అధికారులకు తెలిపినా ప్రయోజనం లేదన్నారు. వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో నరసింహులు, ఆంజనేయులు, కదిరప్ప, అనిల్‌తో పాటు దాదాపు 20 మంది కార్మికులు పాల్గొన్నారు.

బ్యుటీషియన్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-బుక్కపట్నం

స్థానిక సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్యుటీషియన్, ఎంబ్రాయిడింగ్ డిజైన్ శిక్షణ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రవికుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు 3 నెలలు ఉంటుందని, ఆసక్తి కలిగిన యువతీ, యువకులు ఆధార్ లింకు కలిగిన ఫోన్ నెంబర్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సిల్క్ హబ్ కోఆర్డినేటర్ 7981541994ను సంప్రదించాలన్నారు.

మడకశిరలో రేపు మినీ మహానాడు

ప్రజాశక్తి-మడకశిర

ఈ నెల 19వ తేదీ మడకశిర పట్టణంలో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి 'మినీ మహానాడు' ను విజయవంతం చేయాలని టిడిపి నాయకులు ఎం.ఎం.పాండురంగప్ప పిలుపునిచ్చారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పే స్వామి ఆధ్వర్యంలో మినీ మహానాడు నిర్వహిస్తామన్నారు. అందులో టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు, డీలర్లు ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-కదిరి టౌన్

భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన నేపథ్యంలో దేశ సైనికులకు మద్దతుగా ఆదివారం పట్టణంలో తిరంగా ర్యాలీ చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. ర్యాలీ స్థానిక వివేకా గ్రౌండ్ నుంచి ప్రారంభమై నానా దర్గా, కొలిమి రోడ్డు, జక్కుల్ రోడ్డు, చౌక్, శివాలయం, గొల్ల మండపం, హిందూపురం క్రాస్, టవర్ క్లాక్, కలెక్టర్ సర్కిల్, అంబేద్కర్ సర్కిల్, జ్యోతిరావుఫూలే సర్కిల్ మీదుగా జీమాను సర్కిల్ వరకూ కొనసాగుతుంద న్నారు. ర్యాలీలో రాజకీయ పార్టీలకు అతీతంగా నియోజకవర్గ వ్యాప్తంగా యువత, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శ్రీగంగాభవానీ ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-గాండ్లపెంట

గాండ్లపెంటలో వెలసిన శ్రీగంగా భవానీ ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వారు మాట్లాడుతూ ఏటా శ్రీగం గా భవానీ ఉత్సవాలను మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలు, ఆనందోత్సవాలతో జరుపుకుంటారని తెలి పారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆదివారం తెల్లవారుజామున జ్యోతులు, బాణాలు నిర్వహి స్తారన్నారు.

నేటి నుంచి చిన్నమ్మ జాతర

ప్రజాశక్తి-నల్లమాడ

మండలంలోని వంకరకుంట గ్రామంలో ఆదివారం నుంచి బుధవారం వరకూ చిన్నమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అందులో భాగంగా నల్లమాడ నుంచి చెరువుగండ్లపల్లి, కొత్తపల్లి దాకా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఉరుములు, డ్రమ్ములతో అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగిస్తామన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై కూలీల ధర్నా

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం మండలంలోని సోమరాజుకుంట గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద బైఠా యించి ఆందోళన చేపట్టారు. కూలీలు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర్ పనులకు వెళ్తున్న కూలీలకు వేతనం చెల్లించకుండా, పనులు చేయని తన బంధు వర్గానికి బిల్లులు మంజూరు చేశారని ఆరోపించారు. ఈ విషయమై ప్రశ్నించిన కూలీ వెంకటలక్ష్మమ్మపై దాడి చేశాడని, ఇది వరకే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. వీరి ఆందోళనకు మండల సిపిఎం, సిపిఐ నాయకులు సంఘీభావం తెలిపారు. నాయకులు మాట్లాడుతూ మస్టర్లలో బోగస్ పేర్లు నమోదు చేయడం, అవకతవకలకు పాల్పడడం, ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించకుండా వేధిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌పై వెంటనే విధుల నుంచి తొలగించి, బిల్లుల విషయంలో కూలీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగిరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి జి.రమణ, ఉపాధి కూలీలు నంద్యాల ఆనంద్, రామాంజులు, వెంకటలక్ష్మమ్మ, చంద్రావతి, రామలక్ష్మమ్మ, సునీత, సుభద్రమ్మ, ఈశ్వరమ్మ, రమాదేవి, కొండమ్మ, మధు పాల్గొన్నారు.



ఎంపిడిఒ కార్యాలయం ముందు బైఠాయించిన ఉపాధి కూలీలు

జనసేనపార్టీ కార్యకర్తల సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

జనసేన పార్టీకి కార్యకర్తల సేవలు మరువలేనివని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం చిలకం ఆధ్వర్యంలో పార్టీ కేంద్ర కార్యాలయ పరిశీలకులు జ్యుస్టీసర్ సమక్షంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగస్వాములైన క్రియాశీలక వాలంటీర్లను శాలువాతో సత్కరించి సభ్యత్వ కిట్లు అందజేశారు. చిలకం మాట్లాడుతూ కార్యకర్తల కుటుంబాలకు భరోసా అందించేందుకు పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఈ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. సభ్యత్వంతో కార్యకర్తలకు జనసేన పార్టీలో గుర్తింపు, భరోసా ఉంటాయన్నారు. అలాగే పవన్ కళ్యాణ్ పంపించిన ప్రత్యేక సందేశాన్ని చదివి వినిపించారు. జ్యుస్టీసర్ మాట్లాడుతూ నియోజకవర్గం వ్యాప్తంగా 5,133 ఆత్మీక సభ్యత్వాలు నమోదు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీనివాసులు, డీలర్ ప్రతాప్, బాలకృష్ణ, డిష్ రాజు తదితరులు పాల్గొన్నారు.



జనసేన కార్యాలయంలో కార్యకర్తలను సన్మానించిన చిలకం

డిగ్రీ ఫలితాల్లో 'పద్మావతి' విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాల్లో పట్టణంలోని ఎల్‌సి సర్కిల్‌లో ఉన్న శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ మల్లికార్జున, కరస్పాండెంట్ సాయి, డైరెక్టర్ జగదీష్ తెలిపారు. వారు మాట్లాడుతూ యూనివర్సిటీ ప్రకటించిన మూడో సెమిస్టర్ ఫలితాల్లో తమ విద్యార్థినులు యూనివర్సిటీ స్థాయిలో టాప్ మార్కులు సాధించారన్నారు. బీఎస్సీలో పి.సంతోషిణి 94.5శాతం, పి.మమత-94, పి.ధరణి-90, బి.కాంలో కె.విజయదుర్గ 86.25, సి.అనూష-86, పి.మౌనిక-85.7, బిబిఎలో ఎస్.యాస్మిన్-85, ఎం.కల్యాణి-75, బి.స్నేహప్రియ-74 శాతం మార్కులు సాధించారన్నారు. వీరితో పాటు ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థినిని ప్రిన్సిపల్, కరస్పాండెంట్, డైరెక్టర్, కళాశాల అధ్యాపకులు అభినందించారు. ఇంతటి విజయానికి సహకరించిన అధ్యాపకులు, విద్యార్థినుల తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.



థర్డ్ సెమిస్టర్ విద్యార్థినులతో ప్రిన్సిపల్ మల్లికార్జున

ప్రజాశక్తి కథనాలకు స్పందన

వాటర్ ట్యాంకు వద్ద మెట్లు ఏర్పాటు

రొద్దం : మండలంలోని బూచర్ల గ్రామంలో మినరల్ వాటర్ ట్యాంకు వద్ద నీరు పట్టుకునేందుకు ఇబ్బంది లేకుండా తాత్కాలికంగా సిమెంట పెల్లలు ఏర్పాటు చేశారు. 'అందనంత ఎత్తులో తాగునీటి కొళాయి' శీర్షికన గురువారం ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఈవోఆర్‌డి గోవిందప్ప, పంచాయతీ కార్యదర్శి జ్యోతి గురువారం ఆ గ్రామం వెళ్లి వాటర్ ట్యాంకు వద్ద తాత్కాలికంగా సిమెంటు పెల్లలు ఏర్పాటు చేయించారు. సోమవారం శాశ్వత మెట్లు ఏర్పాటు చేయిస్తామని ఈవోఆర్‌డి తెలపారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అధికారుల వెంట పంచాయతీ సిబ్బంది రఫిక్, నాయకులు డీలర్ చంద్రమౌళి, కదిరన్న, మల్లేష్ ఉన్నారు.



మినరల్ వాటర్ ట్యాంకు వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక మెట్లు

సానిపల్లిలో పరిశుభ్రత పనులు

రొద్దం : మండలంలోని సానిపల్లిలో పంచాయతీ సిబ్బంది పారిశుధ్యం పనులు చేపట్టారు. 'సానిపల్లిలో పడకేసిన పారిశుధ్యం' శీర్షికతో శనివారం ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఈఓఆర్‌డి గోవిందప్ప ఆ గ్రామంలో పర్యటించారు. సర్పంచి పరమేష్ ఆధ్వర్యంలో పారిశుధ్యం పనులు చేపట్టారు. అలాగే డ్రెయినేజీల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



సానిపల్లిలో పారిశుధ్య పనులు చేపట్టిన పంచాయతీ సిబ్బంది

ప్రతి ఇంటికీ స్వచ్ఛ నీరివ్వడమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి

ప్రజాశక్తి-బత్తలపల్లి

రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. బత్తలపల్లిలో ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు స్థానిక వెటర్నరీ హాస్పిటల్ ప్రాంగణంలో జడ్పీ నిధుల ద్వారా ఏర్పాటు చేసిన తాగునీటి సరఫరా పథకాన్ని శనివారం మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ బత్తలపల్లితో పాటు పరిసర గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇప్పటికే కొత్తగా 15 బోర్లను డ్రిల్లింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే శుభ్రమైన నీరు అత్యంత అవసరమని, అందుకే గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత తాగునీటి పథకాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

స్వచ్ఛ ధర్మవరం లక్ష్యంగా ముందుకెళ్దాం

బత్తలపల్లిలో చేపట్టిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని చీపురు చేత పట్టి రోడ్లను శుభ్రం చేశారు. అలాగే పరిసరాల పరిశుభ్రతపై ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శంగా నిలిపేలా స్వచ్ఛ ధర్మవరంగా తీర్చి దిద్దడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేష్, ఎంపీడీవో నరసింహనాయుడు, తహశీల్దార్ స్వర్ణలత, జడ్పిటిసి కోటి సుధ, కోటి సూర్యప్రకాష్‌బాబు, బిజెపి మండల అధ్యక్షులు భాస్కర్, ఆకులేటి వీరనారప్ప, నారాయణస్వామి, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు

అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన

ధర్మవరం రూరల్ : మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు మొదట 27, 28 వార్డుల్లో డ్రెయినేజీ కాలువలు, సీసీ రోడ్ల పనులతో, పాటు రూ. 3.35 కోట్ల నిధులతో పట్టణంలో సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. అలాగే మున్సిపల్ రిజర్వ్ స్థలాలకు కంచె ఏర్పాటు చేయడం, మొక్కలు నాటి పార్కులుగా మార్చడం వంటి పనులు, ఇందిరమ్మ కాలనీ, గాంధీనగర్ రైల్వే బ్రిడ్జి వద్ద బటర్ ఫ్లై ఫొటో షూట్ ఏర్పాటు చేశామన్నారు. హిందూ శ్మశానవాటికలో వెంటనే కనీస సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. మంత్రి వెంట ఆర్‌డిఒ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్ బాబు, కౌన్సిలర్ డోలా ఓబుళమ్మ, రాజారెడ్డి, జింకా చంద్రశేఖర్, గొట్లూరు చంద్ర, నాయకులు కమతం కాటమయ్య, ప్రజలు పాల్గొన్నారు.



ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ఎద్దుల పోటీలలో మంత్రి సత్తి కుమార్ యాదవ్

మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

ముదిగుబ్బ : మహిళల ఆత్మవిశ్వాసం, ఆర్థిక స్వావలంబనను పెంపొందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. శ్రీరాముల గ్రామోత్సవంలో భాగంగా మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన ఎద్దుల పోటీలను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఎద్దుల పోటీలు గ్రామీణ జీవనశైలి, సంప్రదా యాలను ప్రతిబింబిస్తాయన్నారు. అనంతరం స్థానిక జడ్పీ బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలో 6 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ముదిగుబ్బ మండలానికి 500 కుట్టుమిషన్లు మంజూరు చేశామ న్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నారాయణస్వామి, ఎంపిపి ఆదినారాయణయాదవ్, ఎంపీటీసీ మంజు, సర్పంచి లక్ష్మీదేవి, బిజెపి మండల అధ్యక్షుడు అంజన్‌రెడ్డి, నాయకులు తుమ్మల మనోహర్ నాయుడు, టిడిపి మండల కన్వీనర్ ప్రభాకర్‌చౌదరి, గడ్డం ఓబిరెడ్డి, కొట్ల బాబి, కంచెం లీలావతి పాల్గొన్నారు.

ట్రంప్ బెదిరింపులకు తలొగ్గే కాల్పుల విరమణ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి-కదిరి టౌన్

దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు తాకట్టు పెట్టడం సిగ్గుచేటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. పట్టణంలోని రోడ్లు భవనాలు అతిథి గృహంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. దేశ రక్షణ రంగం, సైన్యం పట్ల ప్రధాని మోడీకి, బిజెపి నాయకులకు ఎలాంటి గౌరవం, నమ్మకం లేవన్నారు. ఒకవేళ ఉండి ఉంటే ట్రంప్ చెప్పగానే పాక్‌తో ఎందుకు యుద్ధం ఆపారని ప్రశ్నించారు. ఏమి చేయడానికి రక్షణ రంగానికి రూ. లక్షల కోట్లు కేటాయిస్తున్నారని ప్రశ్నించారు. పాకిస్థాన్, భారత్ రెండు దేశాలు కలిసి చర్చించుకుని కాల్పుల విరమణపై స్వతంత్రంగా నిర్ణయం తీసుకొని ఉంటే అభ్యంతరకరం కాదని, అలా కాకుండా దేశ గౌరవాన్ని తాకట్టు పెట్టేలా నిర్ణయం తీసుకోవడం సిగ్గు చేటన్నారు. స్వతంత్రంగా తీసుకోవాల్సిన చర్యలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబితే ప్రధాని మోడీ పాటించడం ఏంటని ప్రశ్నించారు. మోడీవి ఉత్తుత్తి మాటలే కానీ చేతల్లో ఏమి లేదని విమర్శించారు. గతంలో జరిగిన యుద్ధ సమయాల్లో అప్పటి ప్రధానులు మన్మోహన్‌సింగ్, ఇందిరాగాంధీ అమెరికా మధ్యవర్తిత్వాన్ని అంగీకరించేదే లేదని అమెరికా గడ్డపైనే చెప్పారని గుర్తుచేశారు. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సెకి సిఎండి రామేశ్వర్ ప్రసాద్ గుప్తాపై ఆలస్యంగా అయినా చర్యలు తీసుకోవడాన్ని సిపిఐ స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు జిల్లా కార్యదర్శి వేమయ్య, నాయకులు సురేంద్ర, కదిరప్ప, అంజన్‌బాబు, పవన్, లియాకత్, రమణయ్య, మధు, జాన్సన్, ఈశ్వరయ్య, అసన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

'ఆపరేషన్ సింధూర్'కు మద్దతుగా తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి-నల్లచెరువు

భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' విజయవంతం కావడంతో శనివారం నల్లచెరువు లో ఎంపీడీవో రఘునాథ్‌గుప్తా, తహశీల్దార్ రవికుమార్, ఈఓఆర్‌డి శకుంతల ఆధ్వర్యంలో స్థానిక బ్రిల్లియంట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు తిరంగా ర్యాలీ చేపట్టారు. ర్యాలీని స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ వరకూ నిర్వహించి అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. అలాగే వీరజవాను మురళీనాయక్ చిత్రపటం ఉంచి పూలమాల వేసి నివాళు లర్పించారు. అధికారులు మాట్లా డుతూ మురళీనాయక్ లాంటి సైనికులు దేశానికి ఎంతో అవసరం అన్నారు. ర్యాలీలో బ్రిల్లియంట్ ఇంగ్లీష్ మీడియం కరస్పాండెంట్ యు.కార్తీక్, కమ్మల వేమనారాయణ, రఘునాథ్‌రెడ్డి, శంకరాచార్య, కార్తీక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లో 'బీసీల ఐక్యత' సమావేశం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

బీసీల ఐక్యత, రాజకీయ చైతన్యం కోసం పట్టణంలో జూన్ మూడో వారంలో రాష్ట్రంలోని 26 జిల్లాల బీసీ ముఖ్య నాయకులతో 'బీసీల ఐక్యత' సమావేశం నిర్వహిస్తున్నట్లు బిసి రాయలసీమ సంఘం అధ్యక్షుడు కొట్టాల శ్రీరాములు తెలిపారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు బీసీలకు రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలు రాజకీయ చైతన్యం, హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని పార్టీలు బీసీలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో బీసీ ఐక్య సంఘం గౌరవాధ్యక్షులు సామకోటి ఆదినారాయణ, జిల్లా అధ్యక్షుడు ఎల్ఐసి రమణ, జిల్లా కురుబ సంఘం అధ్యక్షుడు కేశాని ఆదినారాయణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఈతకెళ్లి యువకుడు మృతి

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఈతకు వెళ్లగా ఫిట్స్ రావడంతో నీళ్లలో మునిగి ఓ యువకుడు మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని చేనేపల్లి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మరవకొత్తపల్లికి చెందిన సోమశేఖర్(29) చేనేపల్లి సమీపంలోని ఓ బావిలో ఈతకు వెళ్లాడు. ఈత కొట్టి ఇంటికి వెళ్దామని బయల్దేరాడు. కాలికి మట్టి కావడంతో శుభ్రం చేసుకుందామని మెట్ల దగ్గరికు వెళ్లాడు. ఇంతలో ఫిట్స్ రావడంతో నీళ్లలో పడి మునిగిపోయాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది బావి వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కు అయిన అతడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు.



సోమశేఖర్(ఫైల్‌ఫొటో)

పేకాట జూదరులు అరెస్టు

తాడిమర్రి : మండలంలోని పిన్నదరి గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో పేకాట ఆడుతుండగా ఎస్ఐ కృష్ణవేణి పోలీసు సిబ్బందితో కలిసి దాడి చేసి ఏడుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 3,040 నగదు స్వాధీనం చేసుకొన్నారు. దాడుల్లో పోలీసులు అక్బర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలకు న్యాయం చేస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తనకల్లు

నియోజకవర్గంలో పలుచోట్ల సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించి ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ భరోసా ఇచ్చారు. మండలంలోని మండ్లిపల్లి సమీ పంలో ఉన్న ఎస్ఎంఎన్ ఫంక్షన్ హాలులో శనివారం టిడిపి కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశంలో నిర్వహించారు. ముందుగా వివిధ గ్రామాల కార్యకర్తలు వారి వారి గ్రామంలోని, వ్యక్తిగత సమస్యలను ఏకరువు పెట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా నియోజకవర్గంలో రాజకీయాలు చేస్తున్నానని, అధికారంలో ఉన్నా, లేకపోయినా కార్యకర్తలకు అండగా ఉన్నానన్నారు. కార్యకర్తలందరికీ తన వంతుగా న్యాయం చేస్తానని, ఏ ఒక్కరూ అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, నాయకులు పర్వీన్ బాను, శంకర్‌నాయుడు, రవీంద్రారెడ్డి, రాజారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్‌కుమార్, బ్రహ్మానందరెడ్డి, సర్పంచి కాంతమ్మ, చంద్ర, నాగభూషణ, మల్లికార్జున, రవి, ప్రభాకర్‌రెడ్డి, సరోజమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కుల గణనలో 'చలవాది'గా నమోదు చేయండి

ప్రజాశక్తి-పావగడ

కులాల అంతర్గత రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం కుల గణన చేస్తుందని, కావున కుల గణన చేసే వారు ఇంటి వద్దకు వచ్చినప్పుడు మీ కులాన్ని చలవాదిగా పేర్కొనాలని చలవాది సంఘం జిల్లా అధ్యక్షుడు భానుప్రకాష్ సూచించారు. పట్టణంలోని విశ్రాంతి భవనంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కుల గణనలో తమ కులాన్ని చలవాదిగా నమోదు చేయకుంటే భవిష్యత్తు తరం పిల్లలకు అన్యాయం జరిగే అవకాశం ఉంద న్నారు. తాలూకా సంఘం నాయకుడు కెటి. నాగరాజు మాట్లాడుతూ కుల గణనలో చలవాది సభ్యులందరినీ చేర్చేలా గ్రామీణ ప్రాంతాల యువత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాజేంద్ర, కె.రాంపుర నరసింహ, ఆదినారాయణ, డి.రాజేంద్ర, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సభ్యుని ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-పావగడ

తాలూకాలోని కన్నమేడి గ్రామపంచా యతీ సభ్యుని స్థానానికి శనివారం జరిగిన ఉప ఎన్నికలో నూతన సభ్యునిగా కిలార్లహళ్లి గ్రామానికి చెందిన ఎన్.కృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ సభ్యుడు గోవిందప్ప మృతి చెందడంతో ఖాళీ అయిన స్థానానికి నాగేంద్రప్ప, దొడ్డేగౌడ, నాగరాజప్ప, నరసింహమూర్తి, ఎన్.కృష్ణమూర్తి నామినేషన్లు దాఖలు చేశారు. అయితే మిగతా సభ్యులు నామినేషన్లను ఉపసంహరించు కోవడంతో ఎన్.కృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తహశీల్దార్ వరద రాజు ప్రకటించారు. కార్యక్రమంలో సత్యనారాయణరావు, మారుతేష్, మైలారప్ప, రామంజప్ప, తిప్పే స్వామి, రామ్మూర్తి, కీమానాయక్, నరసింహమూర్తి, హనుమంత రాయప్ప, చిక్కీరప్ప, దొడ్డేగౌడ, పాల్గొన్నారు.

మానసిక వికలాంగులను జాగ్రత్తగా చూసుకోవాలి

ప్రజాశక్తి-కొత్తచెరువు

మానసిక వికలాంగులను తల్లిదండ్రు లు జాగ్రత్తగా చూసుకోవాలని జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ దేవరాజు సూచించారు. స్థానిక బిసి కాలనీకు చెందిన సాయి ఈశ్వరి కుమార్తె మానసిక వికలాంగురాలైన ఈషాను శనివారం పరామర్శించారు. తల్లిదండ్రులను అడిగి వివరాలు తెలుసు కున్నారు. ఈ కుటుంబంలో ఎవరైనా ఇలాంటి వారు గతంలో ఉన్నారా, మీరు గర్భిణిగా ఉన్నప్పుడు పౌష్టికాహారం తీసుకున్నారా లేదా అని ఆరా తీశారు. ఈ చిన్నారికి సంబంధించి ఫిజియోథెరపీ, అలవెన్స్ రావడానికి చర్యలు తీసుకోవాలని ఐఆర్‌టిలను ఆదేశించారు. చిన్నారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఉపాధ్యాయులు టి.రామ్మోహన్‌రెడ్డి, ఎం.శ్రీనివాసులు, ఐఆర్‌టిలు పాల్గొన్నారు .

వికలాంగ బాలుడిని భవిత కేంద్రంలో చేర్చిన ఎంఇఒ

ధర్మవరం రూరల్ : ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్చేందుకు సర్వే చేపట్టామని ఎంఇఒలు రాజేశ్వరిదేవి, గోపాల్‌నాయక్ తెలిపారు. ఈ సర్వేలో భాగంగా పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఓ బాలుడిని గుర్తించారు. ఎంఇఒలు బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడి బాలుడిని భవిత కేంద్రంలో చేర్పించారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు సరస్వతి, మల్లికార్జున పాల్గొన్నారు.

పశువుల నీటి తొట్టెలు ప్రారంభం

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని అగ్రహారం పంచాయతీ మరువపల్లి గ్రామంలో నిర్మించిన పశువుల నీటి తొట్టెలను శనివారం నాయకులు, అధికారులు ప్రారంభించారు. ఎపిఒ అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఒక్కో తొట్టెను రూ. 35 వేలు ఖర్చు చేసి నిర్మించారని, తొట్టెలను పరిశుభ్రంగా ఉంచుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రజలతో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాయకులు వన్నూర్‌రెడ్డి, రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి, టిఎ వెంకటకృష్ణ, వెటర్నరీ అసిస్టెంట్ మనోహర్, ఎఫ్ఎ శ్రీనివాసులు, మేట్లు పాల్గొన్నారు.

మడకశిర : మండలంలోని కల్లుమర్రి పంచాయతీలో నిర్మించిన పశువుల నీటి తొట్టెను సర్పంచి గంగమ్మ నాగరాజు ప్రారంభించారు. కల్లుమర్రి పంచాయతీలో 10 పశువుల నీటి తొట్టెలు నిర్మించామని, అందులో నీరు నింపి పశువుల దాహార్తి తీరుస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఏపీవో భార్గవి, జేఈ సుధాకర్, టిఎ కెంచప్ప, ఎఫ్ఎ సోము, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలం లోని కౌలేపల్లి గ్రామంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చొరవతో నిర్మించిన నీటి తొట్టెను శనివారం ఎంపిడిఒ పోలప్ప ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు అంజినప్ప, రూరల్ మండల టిడిపి కన్వీనర్ చెన్నకేశవులు, నాయకులు చంద్ర, గణేష్, జయచంద్ర, పవన్‌కుమార్‌రెడ్డి, మనోహర్, శ్రీకాంత్, శ్రీరాములు, ప్రసాద్, భాగ్యరాజ్, ప్రకాష్, సాంబ, మధు, విజయ్, పాల్గొన్నారు.